మ్యాట్రిమోనీలో పరిచయం.. యువతిపై లైంగికదాడి

జీరో ఎఫ్ఐఆర్.. ఎస్ఆర్ నగర్‌కు బదిలీ

వెంగళరావునగర్, జూలై 1: 'మ్యాట్రిమోనీ' యాప్ ద్వారా పరిచయమైన యువతిపై ఓ ప్రబుద్ధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఎస్ఆర్. నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన ఓ యువతి (27) వివాహం కోసం మ్యాట్రిమోనీ యాప్‌లో నమోదు చేసుకోగా.. అందులో ఎస్ఆర్ నగర్ పరిధిలోని జయప్రకాశ్ నగర్‌కు చెందిన ఫొటో గ్రాఫర్ రాజశేఖర్ పరిచయమయ్యాడు. తాను పెండ్లి చేసుకుంటానని నమ్మించి పరిచయం పెంచుకున్నాడు. యువతికి చెందిన ఈ- మెయిల్ ఐడీని కూడా వినియోగించాడు. గత నెల 24న యువతికి ఫోన్ చేసిన రాజశేఖర్.. జయప్రకాశ్ నగర్‌లో ఉన్న తన ఫొటో స్టూడియోకు రమ్మని పిలిచాడు. మరుసటి రోజు స్టూడియోకు వెళ్లిన యువతిని బెదిరించాడు. చెప్పినట్లు వినకుంటే తన మెయిల్ ద్వారా యువతికి చెందిన ఫొటోలను వైరల్ చేస్తానంటూ బెదిరించి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని హెచ్చరించాడు. బాధితురాలు అక్కడ నుంచి ఇంటికి చేరుకుని.. విషయాన్ని తన దగ్గరి బంధువైన మహిళతో చెప్పింది. వారు ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ తర్వాత ఎఫ్ఐఆర్‌ను ఎస్ఆర్. నగర్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చైన్ స్నాచర్‌గా మాజీ హోం గార్డు

నిందితుడి అరెస్టు.. వివరాలు వెల్లడించిన బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్

వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్, చిత్రంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్

దుండిగల్, జూలై 1: వరుసగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడిని బాలానగర్ ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ద్విచక్ర వాహనంతో పాటు ఆరు తులాల బంగారు గొలుసులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ సోమవారం సాయంత్రం బాచుపల్లి పీఎస్‌లో వివరాలను వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన మహేందర్ సింగ్ (42) గతంలో సైబరాబాద్ పరిధిలో హోంగార్డుగా పనిచేశాడు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాలపై అవగాహన ఉంది. డ్యూటీ చేస్తున్న సమయంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇద్దరు కలిసి మద్యం సేవించడంతో పాటు జల్సాలను తీర్చుకునేందుకు దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు మొదలుపెట్టాడు.

2012 నుంచి 2015 వరకు..

బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, పేట్‌బషీరాబాద్, అల్వాల్ పీఎస్‌ల పరిధిలో మొత్తం 36 దోపిడీలు, స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. దీంతో మహేందర్‌సింగ్‌ను పట్టుకున్న జీడిమెట్ల పోలీసులు అతడిపై పీడీ యాక్టు నమోదు చేసి, జైలుకు పంపించారు. 2017లో జైలు నుంచి విడుదలైన అతడు.. రూ. లక్షన్నర అప్పుచేసి పల్సర్ బైక్ తీసుకున్నాడు. ఈఎంఐలు చెల్లించడంలో ఇబ్బందులు రావడంతో తిరిగి చైన్‌స్నాచింగ్‌లు చేయడం మొదలుపెట్టాడు. జూన్ 24న బాచుపల్లి పీఎస్ పరిధిలోని ఇన్‌కాయిస్ చౌరస్తాలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును అపహరించుకుని పారిపోయాడు. ఆ మరుసటి రోజు జీడిమెట్ల పీఎస్ పరిధిలో మరో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును తెంచుకునేందుకు యత్నించి విఫలమయ్యాడు. అయితే అదేరోజు జూన్ 25న జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలోని ఉషోదయకాలనీలో ఓ మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును అపహరించి పారిపోయాడు.

పోలీసులకు ఇలా చిక్కాడు..

రెండు రోజుల వ్యవధిలోనే మూడు స్నాచింగ్‌లు జరగడంతో పోలీసులు ఈ కేసులను సీరియస్‌గా తీసుకున్నారు. బాలానగర్ డీసీపీ ఆదేశాల మేరకు బాలానగర్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో దర్యాప్తును ముమ్మరం చేశారు. నేరాలు జరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రగతినగర్ ఇన్‌కాయిస్ చౌరస్తా వద్ద జరిగిన స్నాచింగ్ సమయంలో ఓ వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి, నల్లని పల్సర్ బైక్‌పై వచ్చినట్లు గుర్తించారు. అదే వ్యక్తి, అదే బైక్‌పై మరుసటి రోజు తలకు హెల్మెట్ పెట్టుకుని గొలుసులు దొంగిలించినట్లు నిర్ధారణ కావడంతో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు మరింత ముమ్మరంగా దర్యాప్తు కొనసాగించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం బాలానగర్ ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు కలిసి బాచుపల్లిలోని మమత వైద్యశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహేందర్‌సింగ్ పట్టుబడ్డాడు. విచారణలో మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడింది తానేనని అంగీకరించడంతో పోలీసులు అతడి వద్ద నుంచి ఆరు తులాల బంగారు గొలుసులు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు.

తొలి డిజిటల్ సిగ్నేచర్‌తో ఎఫ్ఐఆర్

సిటీబ్యూరో, జూలై 1 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కొత్త చట్టాల ఆధారంగా తెలంగాణలో తొలి ఎఫ్ఐఆర్ పాతబస్తీలో నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాతబస్తీ శాలిబండకు చెందిన రెహమాన్ సోమవారం ఉదయం శాలిబండ నుంచి మదీనా వైపు నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గమనించిన చార్మినార్ పోలీసులు అతడిపై 281 బీఎన్ఎస్, 80(ఏ), 177 మోటరు వాహన చట్టం కింద డిజిటల్ సంతకంతో తొలి ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. గతంలో నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే కేవలం జరిమానా మాత్రమే విధించారు. కొత్త చట్టం ప్రకారం ఇప్పుడు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టం కింద తొలి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన చార్మినార్ పోలీసులను డీజీపీ రవి గుప్తా అభినందించారు.

టోలిచౌకీలో మొరాయించిన సర్వర్లు

మెహిదీపట్నం, జూలై 1: దేశ వ్యాప్తంగా ఉన్న పాస్‌పోర్టు కార్యాలయాల్లో సోమవారం మధ్యాహ్నం సర్వర్లు మొరాయించాయి. పాస్‌పోర్టుల కోసం వచ్చిన దరఖాస్తు దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టోలిచౌకీ షేక్‌పేట నాలా సమీపంలో ఉన్న పాస్‌పోర్టు కార్యాలయం వద్ద ప్రజలు సుమారు గంటన్నర సేపు ఆందోళన చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న పాస్‌పోర్టు కార్యాలయాల్లో సర్వర్లు ఆగి పోయాయని, ప్రజలు ఆందోళన చేయవద్దని అధికారులు సముదాయించారు. గంటన్నర తర్వాత తిరిగి సేవలు ప్రారంభం కావడంతో అందరూ శాంతించారు.

కారుతో ఢీకొట్టి.. మహిళ హత్య

రామంతాపూర్, జూలై 1: ఓ మహిళను ప్రియుడు కారుతో ఢీ కొట్టి హత్య చేశాడు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామంతాపూర్‌కు చెందిన చంద్రమౌళి నాగోల్ మెట్రో స్టేషన్ వద్దనున్న రియల్ ఎస్టేట్ సంస్థలో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. అదే ఆఫీసులో రామంతాపూర్‌కు చెందిన మంజుల (40) ఉద్యోగం చేస్తున్నది. ఆమెతో చంద్రమౌళి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇదిలా ఉండగా.. అదే మహిళ మరో వ్యక్తితో కూడా సన్నిహితంగా ఉన్నట్లు చంద్రమౌళి అనుమానం పెంచుకున్నాడు. దీంతో కోపం పెంచుకున్న అతడు ఆ మహిళను కారుతో ఢీకొట్టి హత్య చేశాడు. అనంతరం ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్

రైలులో గంజాయి.. నిందితుడి అరెస్టు

మారేడ్‌పల్లి, జూలై 1: రైల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి రూ. 4,50,000 విలువ చేసే 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. ముంబైకి చెందిన అబూబాకర్ కసమ్ షేక్ (47) ప్లంబర్. తనకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి దందాను ఎంచుకున్నాడు. విశాఖపట్నంలో గుర్తు తెలియని ఓ వ్యక్తిని నుంచి రూ. 90 వేలకు 18 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. గతనెల 29న విశాఖపట్నం నుంచి మహారాష్ట్రకు రైలులో గంజాయి తరలిస్తున్నాడు. నిందితుడు ప్రయాణిస్తున్న రైలు 30న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో ప్లాట్ ఫారం నంబర్-1లో రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు కలిసి తనిఖీలు చేస్తున్నారు. నిందితుడు అబూబాకర్ అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే రైల్వే పోలీసులు అతడి వద్దకు వెళ్లి ట్రాలీ సూట్ కేస్‌ను తనిఖీ చేయగా.. అందులో గంజాయి ఉన్న విషయం బయటపడింది. రైల్వే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. చేసిన నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

వివాహిత బలవన్మరణం

జవహర్‌నగర్, జూలై 1: దమ్మాయిగూడలో దారుణం చోటు చేసుకుంది. వివాహమై ఏడాది గడిచినా అదనపు కట్నం కోసం భర్త, కుటుంబ సభ్యుల వేధింపులతో వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. జవహర్‌నగర్ ఎస్‌హెచ్ఓ నాగరాజు కథనం ప్రకారం.. విజయవాడ చిట్టినగర్‌కు చెందిన శ్రావణి (23)కి హేమసుందర్‌తో 2023లో వివాహమైంది. వృత్తిరీత్యా హైదరాబాద్‌కు వచ్చి దమ్మాయిగూడలోని ఎంఎల్ఆర్‌కాలనీలో ఉంటున్నారు. పెండ్లి సమయంలో కట్న కానుకలతో పాటు కొంత నగదు కూడా హేమసుందర్‌కు ఇచ్చారు. దుకాణం పెట్టుకునేందుకు అదనపు కట్నంగా పుట్టింటి నుంచి డబ్బు తీసుకురావాలంటూ నిత్యం శ్రావణిని వేధించడం మొదలుపెట్టారు. వివాహమై ఏడాది గడుస్తున్నా.. పిల్లలు కావడం లేదని ఎత్తిపొడుపు మాటలతో భర్త, కుటుంబసభ్యులు మానసికంగా వేధిస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన శ్రావణి ఆదివారం తన గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శ్రావణి తండ్రి పోలీసులకు ఫిర్యాదులో.. ఆమె మృతికి భర్త, అత్తామామల వేధింపులే కారణమంటూ పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బండ్లగూడ, జూలై 1: అతి వేగంతో వచ్చిన కారు డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ప్రమాదం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి బృందావన్ కాలనీకి చెందిన సాయిగణేశ్ (25) ఆదివారం అర్ధరాత్రి మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు కారులో వెళ్తూ.. పీవీ నర్సింహారావు పిల్లర్ నంబర్ 294 వద్ద డివైడర్‌ను ఢీ కొట్టాడు. ప్రమాదాన్ని గమనించిన బాటసారులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు ప్రమాదాన్ని పరిశీలించగా.. అప్పటికే సాయి గణేశ్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆపరేషన్ ముస్కాన్- ఎక్స్

సిటీబ్యూరో, జూలై 1 (నమస్తే తెలంగాణ): వివిధ కారణాలతో తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులు, బాలకార్మికులు, మానవ అక్రమ రవాణాకు గురైన చిన్నారులను గుర్తించి.. వారికి పునరావాసం కల్పించే లక్ష్యంతో ఈ నెల 1 నుంచి 31 వరకు 'ఆపరేషన్ ముస్కాన్- ఎక్స్'ను సైబరాబాద్ పోలీసులు నిర్వహిస్తున్నారని ఉమెన్ అండ్ చైల్డ్ సెక్యూరిటీ వింగ్ డీసీపీ సృజన తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్- ఎక్స్‌పై సోమవారం కమిషనరేట్‌లో నిర్వహించిన సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు, రోడ్లపై యాచక వృత్తిలోకి దిగిన పిల్లలు, అక్రమ రవాణాకు గురైన పిల్లలను గుర్తించేందుకే ఈ 'ఆపరేషన్ ముస్కాన్- ఎక్స్'ను ప్రారంభించామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 11 బృందాలను రంగంలోకి దింపామని వివరించారు. ఈ ప్రత్యేక బృందాలు కమిషనరేట్ పరిధిలో తప్పిపోయిన చిన్నారుల వివరాలను దర్పన్‌లో పొందుపరిచి.. విచారణ జరుపుతారని తెలిపారు. అంతేకాకుండా.. దర్పణ్ వెబ్‌సైట్‌లోని ఫేషియల్ రికగ్నైజేషన్ పద్ధతిలో తప్పిపోయిన చిన్నారులను గుర్తిస్తామన్నారు. అంతేకాకుండా.. బాలకార్మికులుగా వెట్టిచాకిరి చేస్తున్న, యాచక వృత్తిలోకి దిగిన చిన్నారులను సైతం గుర్తిస్తామన్నారు. ఆపరేషన్ ముస్కాన్- ఎక్స్‌కు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సహకరించాలని డీసీపీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉమెన్ అండ్ డబ్ల్యూ ఏసీపీ వి.ప్రసన్నకుమార్, మేడ్చల్ అండ్ సంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారి ఎ.ఎం.రాజారెడ్డి, రంగారెడ్డి జిల్లా చైల్డ్ లేబర్ కమిటీ అధికారి కె.నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 1: బైక్‌పై తలకు హెల్మెట్ లేకుండా రాంగ్ రూట్‌లో వచ్చి.. ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన వ్యక్తి మృతి చెందాడు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసుల కథనం ప్రకారం.. ఏపీకి చెందిన పిడిమి చిన్నారావు (40) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి.. వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం హైదర్‌నగర్‌లోని పిల్లర్ నంబర్ 658 వద్ద తన బైక్‌పై రాంగ్‌రూట్‌లో వస్తున్నాడు. ఈ క్రమంలో ఉప్పల్ నుంచి లింగంపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో చిన్నారావుకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి హెల్మెట్ లేకపోవడం వల్లే తలకు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు.

బెంగళూరు యువతి ఆత్మహత్య

అబిడ్స్, జూలై 1: ఉద్యోగ అర్హత పరీక్ష కోసం నగరానికి వచ్చిన ఓ యువతి అనుమానాస్పద స్థితిలో లాడ్జీ గదిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తులసీ లాడ్జీలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గోరేందర్ గౌడ్ కథనం ప్రకారం.. బెంగళూరుకు చెందిన ఇందూరాణి (31) నగరంలో ఉద్యోగ పోటీ పరీక్ష రాసేందుకు ఆదివారం బెంగళూరు నుంచి వచ్చి.. అబిడ్స్‌లోని రామకృష్ణ థియేటర్‌కు ఎదురుగా ఉన్న తులసీ లాడ్జీలో గది తీసుకుంది. సోమవారం ఉదయం పదకొండున్నర వరకు గది తలుపులు తెరవక పోవడంతో..సిబ్బంది అబిడ్స్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు గది తలుపులు తెరిచి చూడగా.. బెడ్‌పై పడి ఉండటం కనిపించింది. అక్కడే పురుగుల మందు సీసా కూడా లభించింది. అక్కడ లభించిన డైరీ ఆధారంగా బెంగళూరులో ఉన్న కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఓం శివదుర్గా జ్యోతిష్యం

★వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలకైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085. NT-333815

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-334246

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-334237

OLD AGE HOME

★వృద్ధులు & భార్యాభర్తలు A/c & N/C అటాచ్డ్ బాత్‌రూం, మేడిపల్లి/ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి, 24/7 మెడికల్ సర్వీస్. Ph: 7981467036, 9391039990, 9515474083. NT-333820

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 7 జులై-అమరనాథ్ + నవదేవి, 20 సెప్టెంబర్-చార్‌ధామ్, 5 అక్టోబర్ మరియు 6 నవంబర్-కాశీయాత్ర, 10 డిసెంబర్-రామేశ్వరం @ 9908844377. NT-339527

PLOT FOR SALE

★మీ పిల్లల బంగారు భవిష్యత్ కొరకు... అతి తక్కువ ధరకే ప్లాట్... నెల EMI పద్ధతిలో... 1 గుంట భూమి రూ. 2,40,000/-, స్పాట్ రిజిస్ట్రేషన్, జీడికల్ రామాలయం దగ్గరలో, యాదగిరిగుట్ట @ ఆలేరు. Cont: 8179608180. NT-325859

★అతి తక్కువ ధరలో జడ్చర్ల Townకి ఆనుకుని 50 ఎకరాల ఫాంల్యాండ్ గుంట 4.50 లక్షలు మాత్రమే. అవకాడ మొక్కలతో ఆదాయం పంచి ఇవ్వబడును. Ph: 7396428222. NT-325754

★బీబీనగర్ AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA & RERA అప్రూవ్డ్ విల్లా ప్లాట్లు 75% లోన్‌తో/రామగిరి దగ్గర్లో DTCP & ఫాం ప్లాట్లు EMIతో కలవు. 9666703666. NT-320396

★101 Acres: HMDA & DTCP Approved Premium Villa & Commercial Plots 16,500 to 22,000 @ Srisailam Road / Maheshwaram & Sagar Road. Ph: 9900043444 / 9966632101. NT-325809

★FOXCONN Estates 25 Acers HMDA Villa Plots with Club House, Nr. Kongara Collectorate & Foxconn @ Eliminedu. Loans avail. 9676948961. NT-333873

★గజం: 2,500/-కే విజయవాడ హైవే నార్కట్‌పల్లి దగ్గర 4 లైన్స్ రోడ్డు ప్రక్కన ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, ఫామ్ హౌస్, ఎర్రచందనం & పండ్ల మొక్కలతో 1210 గజాలు (10 గుంటలు) ప్లాట్స్ కలవు. సంప్ర: 9666695886. NT-326005

PLOT FOR SALE

★వరంగల్ హైవే, భువనగిరి బైపాస్ ఆనుకుని వివేరా హోటల్‌కి అతి సమీపంలో HMDA అప్రూవ్డ్ విల్లా ఓపెన్ ప్లాట్స్ కలవు. ఆల్ డెవలప్‌మెంట్స్, Spot రిజిస్ట్రేషన్, Bank Loan available. Ph: 9989032598. NT-3959

★ఘట్‌కేసర్‌కి అతి దగ్గరలో HMDA ప్లాట్లు తక్కువ ధరకు కలవు. ఇప్పుడే ఇళ్లు కట్టుకోవచ్చు. బీబీనగర్ & భువనగిరి వద్ద HMDA ప్లాట్లు కలవు. 9704695889, 9505980640. NT-333886

FLAT FOR SALE

★39 Lakhs only Nagole & Boduppal East & West Facing 2BHK & 3BHK 1000, 2000 Sft. in Prime Location, Car Park. Avail. Ph: 6309345838, 9502937289. NT-328267

★కమర్షియల్ 2BHK, 1129 Sft., వెంకటాద్రి థియేటర్ బ్యాక్ సైడ్, దిల్‌సుఖ్‌నగర్, JNTU నిజాంపేట్ రోడ్‌లో హైటెన్షన్ రోడ్ 2BHK, 1015 Sft., W/F & చైతన్యపురి ఫణిగిరి కాలనీ 2BHK, 980 Sft. Ph: 9550615070. NT-333892

HOUSE FOR SALE



★House for Sale at Street No.8, Gayatri nagar, Bandlaguda Jagir, 180 Sq.yards, 5800 Sq.ft. buit up area, 10 years old. Contact: 9866001996 & 6303004248. NT-328273

CHITS

★కపిల్ చిట్స్ (Since 44 Years)లో 10, 25, 30 లక్షలు, 50 లక్షలు & 1 కోటి రూపాయల చిట్స్ కలవు. వేకెంట్ చిట్స్ కలవు. ఫోన్: 8464919899. NT-333891

WANTED

★అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్, వార్డ్ బాయ్స్, ఆయాస్ కావలెను. M/F, D/N స్పాట్ జాయినింగ్, ఎల్.బి.నగర్, హస్తినాపురం, బి.ఎన్.రెడ్డి నగర్, వనస్థలిపురం ఏరియాలలో. 8106220510, 8367511960. NT-326008

★రియల్ ఎస్టేట్ సంస్థ కొరకు సొంత కారు ఉండి, మా కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం కల్గిన వారికి ఇదే మా ఆహ్వానం. సంప్రదించండి: 7981217883. NT-339520

★ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ కొరకు మార్కెటింగ్ చేయుటకు అనుభవం కలిగిన సిబ్బంది కావలెను. ME / MM / SMM / AGM మీరు పనిచేసే ప్రతి ఒక్కరికీ ఉత్తమ అవకాశం మేము Ph: 9000333325ని సపోర్ట్ చేస్తాము. NT-339516

★డ్రైవర్ అవసరం! హైదరాబాద్‌లో ఎవరెస్ట్ ఫ్లీట్ CNG కార్ డ్రైవ్ చేయండి మరియు నెలకు Rs. 25,000* సంపాదించండి!! +91 9324912075 కి కాల్ చేయండి. NT-016

★ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ పర్సన్స్ కావలెను. మంచి కమీషన్ + ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. ఫోన్: 9603849814, 6305680989. NT-326016

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899. NT-325755-All

CHANGE OF NAME

★I, SOMAYAJULU, R/o. 1-89/1/304, Road-3, Sri Sai Gardens, Bhavani Nagar, Nacharam, Uppal, T.S-500076, I Declare that my name is wrongly printed in my Daughter S.S.C. Memo as SOMAYAJULU instead of BHAGAVATHULA ANNESWARA SOMAYAZULU as per all the identity documents. NT-327675

★I, MALLAGARI PRAVEEN KUMAR R/o 2-2-185/27/C, M K nagar, Amberpet, Hyderabad-13 Changed my name as MALLAGARU PRAVEEN KUMAR S/o Mallagaru Shiva kumar for all future purposes NT-327674

★I, Ankam Vishnu Prasad Yadav R/o Alkapur Township Road No 25, Opposite Gandhi Park. Plot No 203 & 204 Apartment Park View Residency, Flat No 201, 2nd Floor. Hyderabad, Telangana 500089 have changed my minor daughter's name from Ankam Chancy to AnkamChandri. NT-35963

★I, RACHCHA JAYAPRAKASH, S/o Indraiah, aged 54 years, residing at 4-55/4, Sita Homes, Meerpet X roads, Balapur Mandal, Hyderabad 500097, Telangana, India. The correction made in my surname From RACHA JAYAPRAKASH to RACHCHA JAYAPRAKASH. Former name is RACHA JAYAPRAKASH NT-02411

LOST

★I, PARVEEN GUPTA C/o. RAVINDER GUPTA, R/o H.No. 2-47/112/A/1, OOTPALLY (V), SHAMSHABAD (M), R.R DIST, TS, THAT I LOST MY ORIGINAL PASSPORT BEARING NO.: HO948623, ON 07-06-2024, AT SHAMSHABAD BUS STOP AREA, IF ANY FOUND PLEASE CALL: 8708981489. NT-326105

★I, PEDDARAPU BALA PRAVEEN, S/o. HUSSAIN, R/o. Plot No. 100, Huda Sai Nagar Colony, Road No. 13, Vanasthalipuram, R.R Dist. T.G-070. Lost my Land bearing Original Document No. 3956/2020, AND 9121/2019, wanted to shifting of my house from Kamalanagar to Huda Sai Nagar Near, for taking the Xerox copy of my Original documents after when I was reached huda sainagar I traced out my original Document was misplaced.if found pls contact me. 6304844819 NT-325861

★I, Kanthety Srinivas S/o K. Ranga Rao, R/o Flat No: 503, Sathvi Block, Venkateshwara Hights, Nacharam, Medchal Malkajgiri Dist, Telangana. While Travelling From ECIL X Roads to HMT Nagar, Nacharam On Motorcycle. I Lost My Original Sale Deed Document No: 534 of 1986 Plot No: 548, Survey No. 277 to 285, Sri Nagar of Rampally Grama Panchayat Keesara RR Dist. 267 Sq.yds, IF Found. Contact: 9849039879 NT-1057

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) ప్రతి అదనపు లైనుకు రూ.75/-

పూర్తి వివరాలకు: "నమస్తే తెలంగాణ" ప్రధాన కార్యాలయం, #8-2-603, 1/7, 8 & 9, Krishnapuram, Rd. No.10, Banjara Hills, Hyderabad-34. Cell: 9848077857

చిక్కడపల్లి, సికింద్రాబాద్ : 9182777202
మల్కాజిగిరి, E.C.I.L: 9182777125
అమీర్‌పేట్, మెహిదీపట్నం : 9182777126
ఉప్పల్, తార్నాక : 9182777806
L.B.నగర్, వనస్థలిపురం : 9182777209
దిల్‌సుఖ్‌నగర్ : 9182777805
B.N.రెడ్డి నగర్, సంతోష్‌నగర్ : 9182777204
కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205

దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 1: అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి, వృద్ధురాలి మెడలో ఉన్న గొలుసును తెంచుకెళ్లిన ఇద్దరిని వారసిగూడ పోలీసులు అరెస్టు చేశారు. వారసిగూడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. వారసిగూడలోని ఐక్యూ ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో కె. శారద (71) ఒంటరిగా నివసిస్తున్నది. తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్‌కు చెందిన కోరుదల శ్రీనివాస్ (48), కుంచపు పుల్లయ్య (62) కలిసి శారద ఒంటరిగా నివసిస్తున్న విషయాన్ని తెలుసుకున్నారు. ముందస్తుగా రెక్కీ నిర్వహించారు. గత నెల 27న ఉదయం 7.50 గంటల సమయంలో శారద ఇంటి మెయిన్ డోర్ వేసేందుకు బయటకు వచ్చింది. అప్పటికే అక్కడున్న శ్రీనివాస్.. ముందుకు దూకి, డోర్‌ను గట్టిగా నెట్టాడు. దీంతో శారద వెనక్కి పడబోయి, కుదురుకుంది. ఆమె ధరించిన బంగారు గొలుసును శ్రీనివాస్ లాక్కునేందుకు ప్రయత్నించినప్పటికీ, శారద దానిని గట్టిగా పట్టుకుంది. ఈ క్రమంలో గొలుసు రెండు ముక్కలై ఒక ముక్క శ్రీనివాస్ చేతిలోకి రావడంతో అక్కడి నుంచి పుల్లయ్యతో కలిసి బైక్‌పై పరారయ్యాడు. బైక్‌ను హబ్సిగూడ మెట్రో స్టేషన్ సమీపంలో నిలిపి.. యాదగిరిగుట్ట బస్సు ఎక్కారు. తమను ఎవరూ గుర్తించకుండా ఉండేందుకు తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు తొలగించారు. సోమవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు తమ ఇంటికి తిరిగి వచ్చిన నిందితులను వారసిగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి పోలీసులు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన పరిష్కరించిన సీఐ ఆర్.సైదులు, డీఎస్సై ప్రకాశ్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గాలిబ్, కానిస్టేబుళ్లు వెంకటేశ్, వేణు, దేవేందర్‌ను ఏసీపీ అభినందించారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

మణికొండ, జూలై 1: నార్సింగి మంచిరేవులలో జరిగిన సివిల్ ఇంజినీర్ హత్య కేసును నార్సింగి పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. వారిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండ చోటాబజార్ నివాసి సయ్యద్ హిదాయత్ అలీ (31) సాదీలో సివిల్ ఇంజినీర్‌గా పని చేశాడు. 20 రోజుల కిందట ఇంటికి వచ్చాడు. ఇదే ప్రాంతానికి చెందిన యువతి (24) అతడి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటోంది. సయ్యద్ హిదాయత్ వచ్చినప్పటి నుంచి ఆమెను వేధింపులకు గురి చేస్తున్నాడు. సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. ఆమె అంగీకరించడంలేదు. అయితే, ఆ యువతికి ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన సయ్యద్ అమీర్ (29)తో సంబంధం ఉంది. సయ్యద్ హిదాయత్ వేధిస్తున్న విషయాన్ని ఆమె అమీర్‌తో చెప్పింది. హత్య చేసి అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు సయ్యద్ హిదాయత్‌ను బయటకు తీసుకురావాలని, గుట్టుచప్పుడు కాకుండా బయటే హత్య చేద్దామంటూ సయ్యద్ అమీర్ ఆ యువతితో చెప్పాడు. గత నెల 29న ఉదయం 11.30 గంటల సమయంలో హిదాయత్ అలీ, ఆ యువతి కలిసి క్వాలిస్ వాహనంలో గ్రీన్ లాండ్స్ కాలనీ మంచిరేవుల ప్రాంతానికి వచ్చారు. వీరి వెనుకాలే బైక్‌పై సయ్యద్ అమీర్ వెళ్లాడు. సయ్యద్ హిదాయత్, యువతి మంచిరేవుల గ్రామంలోకి వచ్చి నిర్మానుష ప్రదేశంలో ఉన్న సమయంలో సయ్యద్ అమీర్ అక్కడికి చేరుకొని సయ్యద్ హిదాయత్‌తో ఘర్షణకు దిగాడు. సయ్యద్ హిదాయత్‌ను విచక్షణా రహితంగా కొట్టి, తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో హిదాయత్ అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం సయ్యద్ అమీర్, ఆ యువతి కలిసి బైక్‌పై పారిపోయారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'నూతన చట్టాలను రద్దు చేయాలి'

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 1: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. భారతీయ న్యాయ సహిత, భారతీయ నాగరికత సురక్ష సహిత, భారతీయ సాక్ష్య అదినీయం.. ఈ మూడు కొత్త చట్టాలు జూలై 1నుంచి అమలులోకి వచ్చాయి. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నామని రుద్రకుమార్ అన్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఆరాంఘర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులుగా చేయకూడదని, కారణాలను పరిశీలించిన తరువాత తప్పిదాన్ని బట్టి కేసులు నమోదు చేయాలన్నారు. కొత్త చట్టం ఆధారంగా డ్రైవర్లకు ఏడేండ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉందని, వెంటనే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ చట్టాలు ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించడంతో నష్టపోయిన ఆటో డ్రైవర్లను వెంటనే ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో డ్రైవర్లందరిరీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, ఇన్సూరెన్స్ సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలన్నారు. కార్మికులకు జీవనోపాధి చూపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, నాయకులు, నారాయణ, నాగేశ్, బలరాం, జహంగీర్, ఇమ్రాన్, రాజు, శ్రీను, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి.. జీవిత కాలం జైలు శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 1 (నమస్తే తెలంగాణ): ప్రేమ, పెళ్లి పేరుతో బాలికకు మాయమాటలు చెప్పి అపహరించి, లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడు ఇంద్రకంటి వంశీకృష్ణ అలియాస్ బబ్లూ (23)కు బతికి ఉన్నంత కాలం జీవితకాలపు శిక్ష, 21వేల జరిమానా విధిస్తూ, బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం అందించాలని న్యాయసేవా సంస్థను ఆదేశిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి పద్మావతి తీర్పునిచ్చింది. అదనపు పీపీ సునీత కథనం ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన వంశీకృష్ణ ఎల్బీనగర్‌లో ఉంటూ.. స్థానికంగా మెకానిక్‌గా పనిచేశాడు. హస్తినాపురం నివాసి అయిన బాధిత బాలికను స్కూల్‌కు వెళ్తుండగా పరిచయం చేసుకుని.. నిత్యం ఆ బాలిక వెంటపడి ప్రేమించాలని వేధించాడు. దీంతో ఆ బాలిక కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా.. నిందితుడికి వార్నింగ్ ఇచ్చి పంపించారు. అయినా.. బుద్ధి మార్చుకోని వంశీ.. 2017, డిసెంబర్ 10వ తేదీన కళాశాలకు వెళ్తున్న బాలికకు మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకువెళ్లి బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. మరుసటి రోజు బాలికను ఆమె ఇంటి వద్ద వదిలేశాడు. బాలిక తల్లిదండ్రులు అప్పటికే హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వంశీకృష్ణను అరెస్ట్ చేసి, రిమాండ్ తరలించారు. తదుపరి దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

హైదరాబాద్‌లో 'మసాలా ప్లాస్టిక్ పీస్ బిర్యానీ'

సిటీబ్యూరో, జూలై 1 (నమస్తే తెలంగాణ): బిర్యానీలో హైదరాబాద్‌కు ఉన్న పేరు ప్రఖ్యాతలన్నీ మూసీలో కలిపేస్తున్నారు. ఇన్నాళ్లు ముగిగిపోయినా, పురుగులు పట్టిన మాంసంతో బిర్యానీని వండి వార్చిన హోటల్ నిర్వాహకులు.. ఇంకా శృతి మించినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఓవైపు ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఏదోఒక హోటల్ నిర్వాహకులు తప్పులు చేస్తూ దొరికిపోతున్నారు. తాజాగా.. మణికొండకు చెందిన ఓ వ్యక్తి స్విగ్గీలో బిర్యానీ ఆర్డర్ చేయగా.. మసాలా దట్టించిన చికెన్ పీస్‌తో పాటు, బాగా ఉడికిన, థమ్ ప్లాస్టిక్ కవర్‌ను కూడా అదనంగా చేర్చి కస్టమర్‌కు అందించారు. మణికొండకు సమీపంలో ఉండే మెహిఫిల్ రెస్టారెంట్‌లో ఈ రుచికరమైన మసాలా ప్లాస్టిక్ బిర్యానీని చూసి బిత్తరపోయిన ఆ కస్టమర్ సోషల్ మీడియాలో ఫొటోతో సహా పంచుకున్నాడు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు, డెలివరీ చేసిన స్విగ్గీ సంస్థను ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో వేయగానే.. నోరూరించే బిర్యానీని చూసి నెటిజన్లు, బిర్యానీ లవర్లు విరుచుకుపడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కస్టమర్ కోరుతున్నా.. అధికారుల ఇంకా పూర్తి స్థాయిలో దృష్టి పెట్టనున్నట్లుగానే ఉన్నారు. కానీ, డెలివరీ చేసిన స్విగ్గీ మాత్రం జరిగిన తప్పిదానికి కస్టమర్‌ను ప్రసన్నం చేసుకునేలా సమాధానం ఇచ్చి.. ప్లాస్టిక్ బిర్యానీపై క్షమాపణలు చెప్పింది.